


చిక్కరు.. దొరకరు..!

చదువుకోవాల్సిన వయసులో మత్తుకు బానిసలై కొందరు.. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఇంకొందరు యథేచ్ఛగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. యువతను నిషా లోకంలో ముంచి జేబులు నింపుకొంటున్నారు. పోలీసుల కళ్లు గప్పి తిరగడంలోనూ వీరు ఆరితేరిపోయారు. జిల్లావ్యాప్తంగా నాలుగేళ్లలో నమోదైన కేసుల్లో ఇప్పటికీ 56 మంది నిందితులు ఎక్కడున్నారో తెలియట్లేదు. ఎంత జల్లెడ పడుతున్నా ఆచూకీ అంతు చిక్కట్లేదు.

అసలు దొంగలు ఎక్కడ?


ఈ దందాలో విక్రేతలకు, కొనుగోలుదారుడిని ప్రత్యక్ష సంబంధం ఉండదు. రైళ్లలో ఫలానా సీటు కింద బ్యాగు ఉందని ఫోన్‌లో చెప్పి కొందరు వ్యాపారం చేస్తున్నారు. మరి కొన్ని సందర్భాల్లో మూడో వ్యక్తుల ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నారు. పోలీసులకు పట్టుబడుతున్నవారిలో ఇలాంటి వారే ఎక్కువగా ఉంటున్నారు. అసలు దొంగలు దొరకట్లేదు.



గత నెల 28న ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి గుణుపురం-విశాఖ రైలులో ఓ సూట్‌కేసును సీటు కింద ఉంచి పాతపట్నంలో దిగిపోయారు. ప్రయాణికులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు తెరిచి చూస్తే అందులో 13.5 కిలోల గంజాయి దొరికింది. తెచ్చిందెవరో.. ఎక్కడి తీసువెళ్తున్నారనే వివరాలు మాత్రం తెలియలేదు.

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం


జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస రైల్వే స్టేషన్లలో ఎక్కువ మంది గంజాయితో పట్టుబడుతున్నారు. ఒడిశా నుంచి ఎక్కువగా ప్రయాణికుల వేషధారణల్లో సరకును అక్రమ మార్గాల్లో గమ్యస్థానాలకు చేరవేస్తూ కొందరు దొరుకుతున్నారు. పర్లాఖెముండి, బరంపురం వంటి ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నారు. జిల్లాలో 2021 నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు 77 కేసులు నమోదు కాగా.. వాటిల్లో గంజాయి క్రయ, విక్రయదారులు జరుపుతున్న 290 మందిని పోలీసులు పట్టుకున్నారు. 234 మందిని అరెస్టు చేశారు. మిగిలిన 56 మంది పరారీలో ఉన్నారు.



పెరుగుతున్న నేరాలు..

నాలుగేళ్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న సరకు 4285.73 కిలోలు. ఇది కేవలం అధికారిక లెక్క మాత్రమే. అనధికారికంగా పట్టుబడని గంజాయి దీనికి మూడింతలు ఎక్కువగా ఉండొచ్చని అంచనా. ఇంత మొత్తంలో క్రయవిక్రయాలు జరుగుతుండటంతో నేరాలూ పెరుగుతున్నాయి. ఆకతాయిల ఆగడాలూ ఎక్కువైపోతున్నాయి. గంజాయి అక్రమ రవాణా కట్టడికి పోలీసులు చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో ఫలితం ఉండట్లేదు. రెండు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో మూలాలు లేకుండా చేసేందుకు నడుంబిగించాలని ప్రజలు కోరుతున్నారు.

- నాలుగేళ్లలో 77 గంజాయి కేసులు
- పరారీలో 56 మంది నిందితులు



త్వరలోనే పట్టుకుంటాం... ఒడిశాతో కలిసి సంయుక్త ఆపరేషన్లు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా, వినియోగాన్ని నిలువరిస్తాం. ఇప్పటి వరకు పరారీలో ఉన్న 56 మందిని పట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. ఎవరికైనా జిల్లాలో గంజాయికి సంబంధించి సమాచారం తెలిస్తే 100, 112 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. – కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

ఆదిపరాశక్తి.. శరణు తల్లీ..!



జిల్లాలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జగన్మాత రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారి ఆలయాలు, దేవీ పీఠాలు, మండపాలు ఆదివారం వేకువ జాము నుంచి కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఎక్కడికక్కడ ప్రత్యేక పూజలు చేశారు. పలు చోట్ల సామూహిక కుంకుమార్చనలు జరిపారు. శ్రీకాకుళం నగరం బలగ కాలభైరవాలయంలో నిర్వహించిన పూజాకార్యక్రమాలు, హాజరైన మహిళలను ఈ చిత్రాల్లో చూడవచ్చు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆధునికీకరిస్తాం

అరసవల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ సముదాయాన్ని ఆధునికీకరిస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో అయిదు కొత్త బస్సులను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా త్వరలో మరో 2000 బస్సులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సౌర, విద్యుత్తు ఆధారిత బస్సులను నడిపించేందుకు చర్చలు జరుగుతున్నాయన్నారు. వర్షం కురిస్తే నీరంతా కాంప్లెక్స్‌లోనే నిలిచిపోతుందని, ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.45 లక్షలు అందజేసినట్లు గుర్తు చేశారు. వైకాపా పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమైయ్యాయని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ వైకాపా పాలనలో ఒక్క బస్సు కూడా మరమ్మతు చేయలేదని, శ్రీకాకుళం 1, 2 డిపోల పరిధిలో 11 నూతన బస్సులను తీసుకొచ్చామని చెప్పారు. విజయవాడకు ఇంద్ర బస్సు సేవలు మళ్లీ ప్రారంభించామన్నారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు

నగర వివరాలిలా.. ● డివిజన్లు: **50** ● జనాభా: **1.83** లక్షలు ● కుటుంబాలు: **65** వేలు

14 ఏళ్లుగా.. ప్రగతికి దూరంగా..!

- ఎన్నికల ఊసే లేని శ్రీకాకుళం నగరపాలక సంస్థ
- ఎమ్మెల్యే హామీతో చిగురించిన ఆశలు

కోర్టు కేసులతో కాలం కరిగిపోయింది. శ్రీకాకుళం నగర పాలక సంస్థలో పద్నాలుగేళ్లుగా ఎన్నికల సందడి లేదు. మూడు సార్లు అవకాశం వచ్చినా అడ్డంకులతో సాధ్యం కాలేదు. పాలకవర్గం లేక ప్రగతి పడకేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పురపాలిక ఎన్నికలపై దృష్టి సారిస్తున్నట్లు ప్రకటించడంతో ఆశలు చిగురించాయి. ఎమ్మెల్యే గొండు శంకర్ సైతం పలు సమావేశాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో అటు రాజకీయ నాయకులు.. ఇటు నగరవాసుల్లో చర్చలు జోరందుకున్నాయి.



న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం పురపాలక సంఘంలో ఏడు పంచాయతీలను విలీనం చేస్తూ 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ నిర్ణయాన్ని పెద్దపాడు మినహా పాత్రునివలస, ఖాజీపేట, చాపురం, కిల్లిపాలెం, తోటపాలెం, కుశాలపురం ప్రజలు వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత కొన్నాళ్లపాటు ఆరు పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింది. 2006లో ఖాజీపేట, కుశాలపురం, తోటపాలెం, పాత్రునివలస పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. విలీనానికి సంబంధించిన వ్యాజ్యం కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో కిల్లిపాలెం, చాపురం, పెద్దపాడు పంచాయతీలకు 2006తో పాటు 2013లో కూడా ఎన్నికలు జరగలేదు. 2021 వరకు అవి ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగాయి.

- 2015 డిసెంబరు 9వ తేదీకి ముందు వరకు గ్రేడ్-1 పురపాలక సంఘంగా ఉన్న శ్రీకాకుళానికి 2005 అక్టోబర్‌లో చివరిసారిగా ఎన్నికలు జరిగాయి.
- చివరి పాలకవర్గం పదవీకాలం 2010 సెప్టెంబర్‌తో ముగిసింది.
- 2015 తర్వాత మూడు సార్లు రాష్ట్రంలోని పురపాలికలకు ఎన్నికలు నిర్వహించినా ఇక్కడ జరగలేదు.
- ప్రస్తుతానికి విలీనానికి సంబంధించిన వ్యాజ్యాలేవీ న్యాయస్థానంలో లేవు. ఓటర్ల జాబితాల్లో లోపాలున్నట్లు ఒకటి మాత్రమే కోర్టులో నడుస్తోంది.

తొలగిన అడ్డంకులు..

కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో జారీ చేసిన విలీన జీవోను 2018లో తెదేపా సర్కారు రద్దు చేసి డీనోటిఫికేషన్ జారీ చేసింది. అప్పటికి విలీనానికి సంబంధించిన కోర్టు వ్యాజ్యాలన్నీ పరిష్కార కావటంతో ఎన్నికలకు మార్గం సుగమమైందని అంతా భావించారు. అధికారులూ గతంలో ఉన్న 36 డివిజన్లలో ఓటర్ల తుది జాబితాలు సిద్ధం చేశారు. ఆ తర్వాత కూడా పలు కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. వైకాపా అధికారంలోకి వచ్చాక 2021 డిసెంబరు 31న మళ్లీ 7 పంచాయతీలను నగరపాలక సంస్థలో విలీనం చేసింది. డివిజన్ల సంఖ్యనూ 50కి పెంచింది. ఆ మేరకు రెండేళ్ల కిందట ఓటర్ల జాబితా రూపొందించారు. ఎప్పుడు ప్రకటన విడుదలైనా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

వీలైనంత త్వరగా నిర్వహిస్తాం... శ్రీకాకుళం నగరపాలక సంస్థకు ఎన్నికల విషయమై ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశాం. డివిజన్ల విభజన, రిజర్వేషన్ల కేటాయింపులో కొన్ని లోపాలు జరిగాయి. వాటిని సరి చేసి. . వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు ఎన్నికలు జరపాలని ప్రయత్నిస్తున్నాం. వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తాం.
– గొండు శంకర్, ఎమ్మెల్యే, శ్రీకాకుళం

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జిల్లాలో కొనసాగుతోంది. ఆదివారం ఎచ్చెర్ల మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 199 మందికి 163, చిలకపాలెం సమీపంలోని శివాని ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 340 మందికి 313 మంది పరీక్షకు హాజరయ్యారు. రెండు పూటలు జరిగిన పరీక్షలకు రెండు కేంద్రాల్లో కలిపి 63 మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 3న ప్రారంభమైన పరీక్షలు 21 వరకు కొనసాగనున్నాయి.

ఆట ఆరంభం



ఎచ్చెర్ల మండలం కేశవరావు జడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా అండర్-19 రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలను సమగ్రశిక్షా రాష్ట్ర పథక సంచాలకుడు(ఎస్పీడీ) బి.శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలకు 13 జిల్లాల నుంచి 156 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. తొలి రోజు లీగ్ దశ మ్యాచ్‌లు జరిగాయి. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, డీఈవో ఎస్.తిరుమలచైతన్య, తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

ఇటు చూడండి.. ఇక్కట్లు తీర్చండి..!



ఎన్నో ఏళ్లుగా ఆమదాలవలస, విజయనగరం జిల్లా సంతకవిటి మండలాల్లోని సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకచోట నుంచి మరో చోటికి వెళ్లాలంటే నాగావళి నదిని దాటేందుకు పడవపై నిత్యం ఇలా ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. నదిపై బలసల రేవు వద్ద వంతెన నిర్మిస్తామన్న పాలకుల హామీ నెరవేరలేదు. 2018లో తెదేపా ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసినా ప్రభుత్వం మారడంతో పనులు జరగలేదు. వైకాపా హయాంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. 50 శాతం మాత్రమే పనులు జరిగాయి. గుత్తేదారుకు బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం



మందస మండలంలోని పలు గ్రామాల రైతులకు ఏటా సాగునీటికి కష్టాలు తప్పట్లేదు. ఆదివారం మండలంలోని చికిడిగాం, పెట్టువా గ్రామాల మధ్య సునాముధి కాలువకు భారీ గండి పడింది. నీరు వృథాగా పోతుండటంతో అన్నదాతలే శ్రమదానం చేసి.. ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. ఈ కాలువ ద్వారా చికిడిగాం, హంసరాలి, టుబ్బూరు, కొయిటాసాయి, చినబరంపురం ప్రాంతాల్లోని సుమారు 1,500 ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. గతంలోనూ పలుమార్లు గండ్లు పడిన సమయంలో అధికారులకు ఎన్ని వినతి పత్రాలిచ్చినా ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలవనరుల ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ గండి పడిన ప్రాంతంలో కాంక్రీట్ గోడ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. – న్యూస్‌టుడే, మందస



అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహించినా, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇసుక కొరత లేదని, ప్రస్తుతానికి ఆరువేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. అంతర్జాలం ద్వారా తీసుకుంటే 24 గంటల్లో సరఫరా చేస్తున్నామని వివరించారు. 16 నుంచి జిల్లాలో కొత్తగా ఆరు రీచ్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పద్ధతిలో కేటాయిస్తామన్నారు. ఇసుక కావాల్సిన వారు https:///www.sand.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా సమీపంలో సచివాలయం ద్వారానైనా ప్రభుత్వం నిర్ణయించిన ధరను చెల్లించి బుక్ చేసుకోవాలన్నారు. ఇసుక తవ్వకాలు, సరఫరా, రవాణాపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే టోల్‌ఫ్రీ నంబరు 1800 4256012, వాట్సాప్ నంబరు 97016 91657ను సంప్రదించాలని కోరారు. అనంతరం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ, గనులశాఖ అధికారులతో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు నిబంధనలు ఉల్లఘించినవారిపై రూ.5.75 లక్షలు జరిమానా విధించామని వెల్లడించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో కె.సాయిప్రత్యూష, అధికారులు పాల్గొన్నారు.

మొత్తం వసతి గృహాలు: **81** | వాటిల్లోని విద్యార్థులు: సుమారు **7,000** | తొలి విడతలో ఎంపికైనవి: సింగుపురం, కోటబొమ్మాళి, నందిగాం, కంచిలి, లావేరు

బీసీ వసతి గృహాల్లో డిజిటల్ పాఠాలు..!

- రిసోర్సు సెంటర్ల ఏర్పాటుకు 5 హాస్టళ్ల ఎంపిక

న్యూస్‌టుడే, పొందూరు, ఆమదాలవలస గ్రామీణం


వెనుకబడిన తరగతుల(బీసీ) సంక్షేమ వసతి గృహాలకు మంచి రోజులు రానున్నాయి. వైకాపా పాలనలో సౌకర్యాల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా వసతి గృహాల్లో వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుకు డిజిటల్ రిసోర్సు సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాలో సొంత భవనాలున్న అయిదు వసతి గృహాలను ఎంపిక చేశారు. జిల్లాలో ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ బీసీ వసతి గృహాల్లో డిజిటల్ తరగతుల ఏర్పాటుకు ప్రభుత్వం తొలి విడతలో ఐదింటిని ఎంపిక చేసింది. నవంబరు 14న బాలల దినోత్సవం రోజున వాటిని ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎంపిక చేసిన హాస్టళ్లలో ఓ గదిని ఆహ్లాదంగా తీర్చిదిద్దుతారు. అందులో డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు అమర్చడంతో పాటు పాఠ్యాంశాల బోధనకు సమాచారాన్ని పెన్‌డ్రైవ్‌లలో అందుబాటులో ఉంచుతారు.



లావేరు బీసీ వసతి గృహంలో విద్యార్థులు

సందేహాల నివృత్తికి బోధకులు..

వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై బడి నుంచి వచ్చిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ పెట్టనున్నారు. సులువుగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలను డిజిటల్ విధానంలో వివరించడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు అనుమానాలు నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా ట్యూటర్లను నియమించారు. వారు గణితం, సైన్సు, ఆంగ్లం, హిందీ సబ్జెక్టులు బోధిస్తారు. ఒక్కో ట్యూటర్‌కు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తారు. విడతల వారీగా మిగిలిన వసతి గృహాల్లోనూ డిజిటల్ తరగతులు నిర్వహించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అనూరాధ తెలిపారు.



(c) eenadu

చివరి మజిలీకి కష్టమే!

ఉన్న ఊరును విడిచి పెట్టి ప్రభుత్వం కేటాయించిన నిర్వాసిత కాలనీల్లో నివసిస్తున్న వారిని సమస్యలు ఇంకా వెంటాడుతున్నాయి. కొత్తూరు మండలంలోని గూనభద్ర ఆర్ అండ్ఆర్‌కాలనీ పంచాయతీలోని పాడలి, గదబపేట తదితర గ్రామాల్లోకి ప్రజలు ఆరేళ్ల క్రితం వచ్చారు. వీరికి ప్రభుత్వం శ్మశానవాటికకు రహదారి నిర్మించలేదు. ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందగా, మృతదేహాన్ని అత్యంత కష్టంగా పొలాల మధ్య నుంచి, గట్ల వెంట శ్మశానానికి చేర్చి, అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. **– న్యూస్‌టుడే, కొత్తూరు**




రండి చూసుకుందాం..!



టెక్కలిలో వీధి కుక్కల స్వైర విహారంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఇటీవల కంచ్రవీధి, కోదండరామవీధి, అక్కపువీధి ప్రాంతాల్లో కుక్కకాటు బారిన పడి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో కుక్కల గుంపు హల్‌చల్ చేయడంతో అటుగా వెళ్లేవారు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు చేశారు. అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై కార్యదర్శి జగన్నాథరావు మాట్లాడుతూ.. పంచాయతీ సర్వసభ్య సమావేశంలో సమస్యపై చర్చించామని, కుక్కలను పట్టుకుని వేరే ప్రాంతానికి తరలిస్తామని చెప్పారు. నిధులు వెచ్చించేందుకు డీపీవో అనుమతి రాగానే చర్యలు చేపడతామన్నారు. **– న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం**

నో‘టమాటా’ రావడం లేదు..!

టమాటా ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులను బెంబేలెత్తి పోతున్నారు. ఆదివారం



బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100కు వ్యాపారులు విక్రయించడంతో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి. శనివారం వరకు సాధారణంగా ఉన్న ధర ఆదివారానికి అనూహ్యంగా పెరిగిపోయింది. ప్రభుత్వం ధరల పెరుగుదల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

మిత్రమా.. కుశలమా..!

హిరమండలం శ్రీరామేశ్వర డిగ్రీ కళాశాలలో ఆదివారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1967-1968 సంవత్సరం ఎస్ఎస్ఎల్సీ చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. పూర్వ విద్యార్థి నామాన కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.కేశవరావును సత్కరించారు. పూర్వ విద్యార్థులు బి.సంజీవరావు, ఆర్.అప్పారావు, పాణిగ్రహి, ఎం.చిన్నయ్య, రంగారావు, సూర్యనారాయణ, కృష్ణారావు, ధర్మారావు, గోపి మాస్టర్ పాల్గొన్నారు. **– న్యూస్‌టుడే, హిరమండలం**



పొట్టకూటికి వెళ్లి ప్రాణాలు కోల్పోయి


- సిలిండర్ పేలి ఇచ్ఛాపురం వాసి మృత్యువాత



బడకల కేశవరావు

ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం పనిలో చేరి నాలుగు నెలలైనా పూర్తి కాలేదు. ఇంతలో ప్రమాదం మృత్యువు రూపంలో అతన్ని కబళించింది. కూలి డబ్బులతో దసరా పండుగకు వస్తానని ఫోన్‌లో భార్యకు చెప్పి 24 గంటలు గడవక ముందే ఆతడు చనిపోయాడన్న వార్త కుటుంబ సభ్యులను కలచి వేసింది. సిమెంటు ఇటుకల పరిశ్రమలో ఉపాధి పనులకు వెళ్లిన ఇచ్ఛాపురం ప్రాంత బడకల కేశవరావు (52) అనుకోని ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. పోలీసులు, కుటుంబసభ్యులు అందించిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం కొళిగాం పంచాయతీ పరిధిలోని గ్రామానికి చెందిన కేశవరావు ఇద్దరితో కలిసి అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు సమీపంలోని ఫ్యూజన్ సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి వంటగది నుంచి గ్యాస్ లీకైన వాసన రావడంతో చూసేందుకు కేశవరావు వెళ్లాడు. గదిలో లైట్ స్విచ్ వేయగా ఒక్కసారిగా పేలుడు సంభవించి అతడితో పాటు మిగిలిన ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని వెంటనే ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కేశవరావు ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు బోరు విలపిస్తూ చెప్పారు. సమాచారం అందుకున్న గ్రామ మాజీ సర్పంచి సాడి సహదేవ్‌రెడ్డి స్పందించి, ఎమ్మెల్యే అశోక్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకుని, కుటుంబానికి అండగా నిలిచారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య రాజులమ్మ, కుమారులు శ్రీకాంత్, శశిధర్ ఉన్నారు. ఈ ఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



అప్పన్న (పాత చిత్రం)

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: నరసన్నపేట మండలం చోడవరం వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ట్రాక్టర్ ఢీకొని చెన్నాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. చెన్నాపురం గ్రామానికి చెందిన దుండంగి కర్రి అప్పన్న(50) అల్లాడలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి సైకిల్‌పై వస్తుండగా చోడవరం వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య అసిరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి

పలాస, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నిర్మన్ యాప్ ద్వారా తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం పట్టణాల్లో ఎగుమతులు చేపట్టనున్నామని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జబాబూరావు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో రూ.45 కోట్లతో పండ్ల రసాల తయారీ కేంద్రం ఏర్పాటు, కూరగాయల ఉత్పత్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు బాబురావు అన్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించి అనంతరం పలాస విచ్చేసిన ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మాణం చేపడుతున్న పోర్ట్ ప్రాంతాల్లో లాజిస్టిక్స్ ఏర్పాటు కోసం 10 ఎకరాల స్థలం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని, ఆయా ప్రాంతాల్లో కంటైనర్లు ఏర్పాటు చేసి ఆదాయం పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎగుమతులు, దిగుమతులు జరిగేలా ప్రాధాన్యత కల్పించాలనే యోచనతో ఉన్నామన్నారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి కోసం, వ్యాపారులు ఉత్పత్తి చేసే సరకులు గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు వేర్‌హౌసింగ్ గోదాముల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. విశాఖపట్నం కేంద్రంగా మూతపడిన పరిశ్రమలకు చేయూత అందించి ఎగుమతులకు ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. ట్రేడ్ సెంటర్లు, కన్వెన్షన్ సెంటర్లు, పరిశ్రమలకు ప్రమోట్ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.95 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి దర్శించుకున్నారు. పలువురు భక్తులు కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించగా, కొందరు మహిళా భక్తులు ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి ఆ ఆవరణలో క్షీరాన్నం స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. దర్శన టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.3.95 లక్షల ఆదాయం సమకూరింది. ప్రసాదాల కౌంటర్లు, క్యూలైన్లలో తాగునీటిని ఆలయ అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు.

చికెన్ ధరలు

రకం	బ్యాగ్‌లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

వంశధార కుడి, ఎడమ ప్రధాన కాలువల ప్రవాహ సామర్థ్యం క్రమేపీ తగ్గిపోతోంది. కాలువల్లో పూడికలు తొలగింపు పనులు పూర్తి స్థాయిలో చేపట్టక పోవడం, నిర్వహణ లోపం, ఆధునికీకరణ పనులు జరగకపోవడం కారణంగా మారింది.

– న్యూస్‌టుడే, హిరమండలం, ఎల్ఎన్‌పేట



పాతహిరమండలం వద్ద వంశధార కుడి ప్రధాన కాలువ వయోడక్టు నుంచి బయటకు ప్రవహిస్తున్న సాగునీరు

నిండా పూడిక.. సాగు చేసేదెలా ఏలిక..!

- వంశధార కాలువల్లో తగ్గుతున్న ప్రవాహ సామర్థ్యం
- పలుచోట్ల గండ్లు.. నీటి వృథా
- శివారు భూముల అన్నదాతల ఆవేదన

కాలువల్లో తరచూ ఎలుకల రంధ్రాలు పెడుతుండటంతో గండ్లు పడుతున్నాయి. ఇదే కాకుండా పూర్తి సామర్థ్యంతో నీరు ప్రవహించిన సమయంలో గట్లు బలహీనంగా ఉన్నా.. గండ్లు పడే ఆస్కారం ఉంది. ఇలాంటి ఘటనలు జరిగితే కాలువ దిగువన ఉన్న గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వెంటనే అధికారులు పరిశీలించి బలహీన ప్రదేశాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి. ఈ ఏడాది వంశధారలో వరదనీటి ఉద్ధృతి అంతగా లేకపోవడంతో ప్రమాదాలేమి జరగలేదు. తీవ్రత పెరిగితే దాని ప్రభావం కాలువల పైన పడేది.

వయోడక్టు నుంచి నీరు వృథా

పాతహిరమండలం గ్రామం వద్ద వంశధార కుడి ప్రధాన కాలువ వయోడక్టు నుంచి నీరు వృథాగా బయటకు వెళ్లిపోతుంది. కాలువ పరిధిలో హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, గార, శ్రీకాకుళం, బూర్జ మండలాల్లో 82 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పూర్తి స్థాయిలో పూడికలు తీసే పనులు గత కొన్నేళ్లుగా జరగక పోవడంతో నీటి సామర్థ్యం తగ్గిపోయింది. కాలువ లోతు 2.9మీటర్లు ఉంటే దాదాపు 0.6మీటర్ల మందంలో పూడిక పేరుకుంది. ఈ నేపథ్యంలో జలవల 650 క్యూసెక్కులు విడిచిపెట్టగా పాతహిరమండలం వద్ద వయోడక్టు నుంచి నీరు వృథాగా పోయింది. పంటలకు నీరందలేదు. దీంతో సాగు ఎలా చేయాలని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వంశధార కాలువ

ఎడమ కాలువదీ అదే పరిస్థితి

వంశధార ఎడమ ప్రధాన కాలువ జలాలు హిరమండలం, సారవకోట, జలుమూరు, నరసన్నపేట, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, టెక్కలి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లో 1.48లక్షల ఎకరాలకు అందుతున్నాయి. 1977లో కాలువ నిర్మాణం జరిగింది. 47 ఏళ్లుగా ఆధునికీకరణ పనులు జరగకపోవడంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెడితే ఏదో ఒకచోట గట్టు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది.

ప్రతిపాదనలు పంపించాం.. ఎడమ ప్రధాన కాలువ నిర్మించి దశాబ్దాలు గడిచాయి. దీంతో కాలువ ఆధునికీకరణ పనులకు రూ.900 కోట్లతో ప్రతిపాదనలు గతంలో పంపించడం జరిగింది. అవసరమైన చోట పూడికలు తొలగిస్తున్నాం. కుడి కాలువలో పూడికలు తొలగించేందుకు ప్రభుత్వానికి నివేదించాం.

– రాంబాబు, ఎస్ఈ, వంశధార సర్కిల్ కార్యాలయం, శ్రీకాకుళం

విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే లక్ష్యం



తలపడుతున్న అనంతపురం, విజయనగరం జిల్లాల బాలికల జట్లు

- సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు
- ఘనంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అప్పుడే విద్యా లక్ష్యాలను చేరుకోగలుగుతామని సమగ్రశిక్షా రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్, ఎండీఎం రాష్ట్ర డైరెక్టర్, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఇన్‌ఫ్రా బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కేశవరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే అండర్-19 బాలికల కబడ్డీ రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. క్రీడలతోనే శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని విద్యా హబ్‌గా తయారుచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఎంఈవో కారు పున్నయ్య, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బెండు మల్లేష్, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, కూటమి నేతలు, అధికారులు, ఉద్యోగులు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తనిఖీ కేంద్రం పరిశీలన

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని పైడిభీమవరం సమీపంలో జిల్లా సరిహద్దు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం రాత్రి పరిశీలించారు. 24 గంటల పాటు రెవెన్యూ, పోలీసు, ప్రత్యేక బలగాలతో తనిఖీలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జేసీ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష ఉన్నారు.



9న జిల్లాస్థాయి చదరంగం పోటీలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9న జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు బగాది కిశోర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 విభాగంలో నిర్వహించనున్న ఈ పోటీలకు జనవరి 01, 2009 తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి పోటీలకు హాజరుకావాలని స్పష్టం చేశారు. ముందుగా క్రీడాకారులు తమ వివరాలకు 9912559735 నంబరుకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

ఉత్తరాంధ్రలో ఫుట్‌బాల్ అకాడమీ



మాట్లాడుతున్న రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి ఉత్తరాంధ్రలో అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం సీనియర్ పురుషుల జిల్లా జట్ల ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో క్రీడలను పూర్తిగా విస్మరించారని.. ప్రస్తుతం మంచి రోజులు వచ్చాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ సంయుక్త కార్యదర్శి నవీన్‌కుమార్, నరసన్నపేట అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంకుపల్లి రవికుమార్, కార్యదర్శి రమేష్, పీడీ కె.గోపి, అనిల్‌కుమార్, ఎన్ఎఫ్ఏ ప్రతినిధులు సృజన్‌కుమార్, అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

EENADU e Classifieds

REAL ESTATE

PLOT FOR SALE

భోగాపురం ఇంటర్నేషనల్ Airportకి అతి సమీపంలో National Highwayకి 1.5 KM Distanceలో Vempadam Village వద్ద 100 చ॥గ॥ 8,99,999/- కే ఇంటి స్థలం కలదు. Cont : 8247013940, 9666959299.

విశాఖ చుట్టు ప్రక్కల VMRDA అప్రూవ్డ్ ఇళ్ల స్థలాలు స్పాట్/ వాయిదాలతో & బ్యాంక్ లోన్ సదుపాయంతో అమ్మకం. గరిమెళ్ల పద్మావతి. 9493640700, 9493640600.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

TO LET

శ్రీకాకుళం టౌన్‌లో Beside గాంధీ పార్క్ లైన్ అరుణప్లాజా ఫ్లాట్ నెం.T4 అద్దెకు ఇవ్వబడును. లిఫ్ట్ సౌకర్యం కలదు. Cont: 9440436458.

JOBS

నిడదవోలు శంకరాపురం హృదయాలయం ఆశ్రమ ప్రత్యేక దివ్యాంగుల పునరావాస కేంద్రం నందు జీతంకు రెసిడెన్షియల్‌గా పనిచేయుటకు వంటవాళ్ళు, వార్డెన్, ఆయాలు, డ్రైవర్, స్వీపర్ కావలెను. సం॥ 94933 08199, 94409 42148.

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం.18K . ✆ 96402 58899, 96404 68899.

SSR డిగ్రీ & పిజి కాలేజ్ RTC కాంప్లెక్స్ దగ్గర జిల్లా కోర్టు ప్రక్కన శ్రీకాకుళంలో పనిచేయుటకు క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్స్ - M/F వాచ్‌మెన్స్ - M/F అటెండర్స్ - M/F స్వీపర్స్ - M/F ఇంటి పనిమనిషి - F కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. పూర్తి బయోడేటాతో కాలేజ్‌లో సంప్రదించండి.

శ్రీకాకుళం టౌన్ కొత్తరోడ్‌లో గల వాటర్ ప్యూరిఫయర్ షాపులో షిఫ్ట్ వైజ్ పనిచేయుటకు 10th కనీస అర్హత గల మహిళా ఉద్యోగులు కావలెను. ✆ 9381714633.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శతాధిక వృద్ధుడి మృతి



గార గరికన్న (పాత చిత్రం)

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని గూనభద్ర ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన గార గరికన్న (110) అనే శతాధిక వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. ఆయన భార్య ఆరుద్రమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు కాగా.. మనవళ్లకు సైతం వివాహాలు అయ్యాయి.

రాష్ట్రస్థాయి క్రికెట్‌లో సిక్కోలు మెరుపులు



నంబాళ్ల సుశాంత్



రాజాన జున్నారావు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తాచాటారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో చక్కటి ప్రదర్శనతో రాణించారు. బీసీసీఐ ఆధ్వర్యంలో చండీగఢ్ ఐఎస్ బింద్రా క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్ 19(లిస్ట్ ఏ) వినూ మన్కడ్ ట్రోఫీ - 2024 రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన పోటీల్లో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ తరఫున ప్రాతినిధ్యం వహించిన నంబాళ్ల సుశాంత్ 62 బంతుల్లో 53 పరుగులు సాధించాడు. రాజాన జున్నారావు 10 ఓవర్లలో పొదుపుగా బౌలింగ్ చేసి 44పరుగులిచ్చి 3 వికెట్లు దక్కించుకున్నాడు. ఆంధ్రక్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) జట్టు ఈ మ్యాచ్‌లో నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 371 పరుగులు సాధించింది. లక్ష్య ఛేదనలో చండీగఢ్ చతికిలపడటంతో ఏసీఏ విజయకేతనం ఎగురవేసింది.

వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమైన ఈ రోజుల్లో సమాజానికి సాయం చేయాలనే గుణం అడుగంటిపోయింది. కానీ అలాంటి వ్యక్తులు తారసపడితే వారి గురించి చెప్పుకోవాల్సిందే.. సోంపేటకు చెందిన పెడిశెట్టి బైరిస్వామి అదే కోవలోకి వస్తారు. చిన్న దుకాణంతో జీవనోపాధి పొందుతున్న ఆయన తన డబ్బుతో కలిపి రూ.రెండు కోట్ల నిధులు సమకూర్చి సత్యదేవుడి ఆలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో అన్ని అవాంతరాలను అధిగమించారు.



సోంపేట సత్యదేవుని ఆలయం

సామాన్యుడి సంకల్పం.. ఆధ్యాత్మిక సౌరభం

- సోంపేటలో సత్యదేవుడికి ఆలయం
- రూ.2కోట్లకు పైగా నిధులు సమకూర్చిన భక్తుడు బైరిస్వామి

న్యూస్‌టుడే, సోంపేట

బైరిస్వామిది చిన్ననాటి నుంచి కష్టపడే తత్వం. పిల్లలు లేకపోవడంతో ఒక అమ్మాయిని దత్తత తీసుకొని అన్ని బాగోగులు చూసి వివాహం చేసి పంపించేశారు. యువకుడిగా ఉన్న సమయం నుంచి సమాజానికి మేలు చేయాలనే భావనలో ఉన్న ఆయన అప్పటి నుంచి డబ్బు కూడబెట్టారు. సత్యదేవుడి ఆలయం లేదని గుర్తించి నిర్మించాలనుకున్నారు. భార్య జ్యోతికుమారి సహకరించడంతో దాచుకున్న మొత్తంతోపాటు కొంత అప్పు చేయగా, విషయం తెలుసుకున్న దాతలు ముందుకు రావడంతో రూ.2 కోట్లు సమకూరాయి. సోంపేటలో ఆలయం నిర్మాణానికి పూనుకొన్నారు.



మూలవిరాట్ సత్యనారాయణ స్వామి

తంజావూరులో స్వామి విగ్రహం తయారీ

స్థానిక సోమపోలమాంబ ఆలయం ముందున్న స్థలాన్ని కొనుగోలు చేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. స్థలం కోసమే రూ.కోటి వరకు వెచ్చించగా, నిర్మాణానికి మరో రూ.కోటిపైగా అయింది. తంజావూరులో స్వామి విగ్రహాన్ని తయారు చేయించారు. మఖరతోరణం, వెండికవచం, ఉత్సవ విగ్రహాలు, ధ్వజస్తంభం, గాలిగోపురానికి దాతలు సహకరించారు. బైరిస్వామి ఛైర్మన్‌గా ట్రస్టు ఏర్పాటు చేసి నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

చిరకాలం నిలిచిపోతాం.. కష్టపడి సంపాదించిన మొత్తం సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతోనే సత్యదేవుని ఆలయ నిర్మాణానికి సంకల్పించాను. కొందరు ఆధ్యాత్మికవేత్తలు, దాతలు ఇందుకు సహకరించారు. ఇలాంటి పనుల వల్ల ప్రజల్లో చిరకాలం నిలిచిపోతాం.

– పైడిశెట్టి బైరిస్వామి, జ్యోతికుమారి దంపతులు



(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం:	9440437129
పలాస :	8008574279
కవిటి గ్రామీణం :	8309638875
పలాస గ్రామీణం:	7386408926
కంచిలి గ్రామీణం:	9704568738

?: బెల్లుపడకాలనీ పాత హాస్టల్ వద్ద చెత్త పేరుకుపోయి ఇబ్బందికరంగా ఉంటోంది. **-కె.సత్యనారాయణ, ఇచ్ఛాపురం**

❖ చెత్తను తొలగిస్తాం.
-పి.ఉపేంద్రకుమార్ పుర ఎస్సై, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: పలాస మండలం రెంటికోటలోని గొల్ల వీధిలో సీసీ రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం - **స్థానికులు**

❖ త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం
- సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట
–న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

?: పలాస గోరువీధిలో పగలు, రాత్రి తేడా లేకుండా దీపాలు వెలుగుతున్నాయి. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోండి.
- టి.దినేష్‌కుమార్, గోరువీధి, పలాస

❖ వీధి దీపాల టైమర్ పాడవ్వటంతో పగలు వెలుగుతున్నాయి. దానికి మరమ్మతులు చేపట్టి రాత్రివేళ మాత్రమే వెలిగేలా మరమ్మతులు చేపడతాం. **- సురేష్, విద్యుత్తు నిర్వహణ ఉద్యోగి, పలాస** – న్యూస్‌టుడే, పలాస

మౌలిక సదుపాయాలు కల్పించండి


బాబూరావుకు వినతిపత్రం అందిస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

పలాస, న్యూస్‌టుడే: ముత్యాలమ్మ కోనేరు, నెహ్రూ పార్కులో మందుబాబుల నుంచి రక్షణ కల్పించాలని వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు విన్నవించారు. పలాసలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్‌కార్పొరేషన్ అధ్యక్షుడు వజ్జ బాబురావుకు ఆదివారం క్లబ్ సభ్యులంతా కలిసి వారి కష్టాలను ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, కమిషనర్ రామారావుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని బాబూరావు తెలిపారు.

అందరికీ అందుబాటులో రేషన్ దుకాణాలు


జల్లుపుట్టుగలో రేషన్ డిపోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: అందరికీ అందుబాటులో రేషన్ సరకులు ఉంటాయని ఎమ్మెల్యే అశోక్ బెందాళం అన్నారు. కవిటి మండలం జల్లుపుట్టుగలో ఆదివారం రేషన్ డిపోను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఇక్కడి రేషన్ కోసం వేలి ముద్ర వేసేందుకు పక్క గ్రామానికి వెళ్లకుండా ఇంటి వద్దనే రేషన్ తీసుకోవచ్చునన్నారు. సర్పంచి కరిమ్‌కుమార్ దినాన్ని పది మందికి ఉపయోగపడే సేవాదినంగా చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. ఐటీడీపీ మండల విభాగ అధ్యక్షుడు కె.నరేంద్రరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు కేశుపురంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. మెడికవర్ వైద్య నిపుణుడు ఉంగా సాయికుమార్, వైద్య బృందం రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులను అందించారు. కేశుపురం, సన్యాసిపుట్టుగ, నీలాపుట్టుగ గ్రామాలకు చెందిన వారు సేవలు పొందారు. ఉద్దానం బ్లడ్ బ్యాంక్ ద్వారా 26 మంది యువకులు, పెద్దలు రక్తదానం చేశారు. మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, కామేశ్వరరావు, సాడి సహదేవ్‌రెడ్డి పాల్గొన్నారు. ● కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. బైరిపురం గ్రామంలో ఎంపీ నిధులు రూ.5 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో నిర్మించిన యాదవ సామాజిక భవనాన్ని ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకులు సీపాన వెంకటరమణ, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మాజీ జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కాశీబుగ్గలో అన్నదానం

కాశీబుగ్గ, పలాస, న్యూస్‌టుడే:. కాశీబుగ్గ 11 వార్డులో ఏర్పాటు చేసిన దుర్గా మండపం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించారు. నవరాత్రుల మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ● కాశీబుగ్గలో రాజరాజేశ్వరి దుర్గాదేవి ఆలయంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పూజలు చేశారు.

అమ్మలగన్నమ్మ.. స్వేచ్ఛావతమ్మ

❖ ఇచ్ఛాపురంలో ఏటా ఘనంగా దసరా ఉత్సవాలు
❖ వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉత్కళాంధ్రుల ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందిన ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి నామంతోనే ఇచ్ఛావతి ఒకటి. ఆ పేరిట ఏర్పడిన గ్రామమే ఇచ్ఛాపురం. శతాబ్దాల చరిత్ర ఉన్న మహిమాన్విత నారాయణి రూపం స్వేచ్ఛావతి. అమ్మవారు శాంతి స్వరూపిణిగా ఇక్కడ దర్శనమిస్తారు. అమ్మను స్మరించి, మొక్కులు చెల్లించుకునేందుకు మన రాష్ట్రంతోపాటు పక్కనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. ఏటా దసరా సమయంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

శాంతి స్వరూపిణిగా ప్రసిద్ధి..


అమ్మవారి కృష్ణశిలా విగ్రహం

దసరా ఉత్సవాల్లో అమ్మవారిని నవదుర్గామాత రూపంలో కొలిచేందుకు భక్తులు ఉవ్విళ్లూరుతారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఇచ్ఛాపురం సరిహద్దు రవాణారంగ కేంద్రానికి వచ్చిన వారు ఈ నవరాత్రుల్లో ఒక రోజు ఇక్కడ గడిపేందుకు వస్తుంటారు. అమ్మవారిని బాలిక రూపంలోనే భక్తులు దర్శిస్తుంటారు. గిలావీధి, పొందరవీధి, బెల్లుపడ, ఉప్పలవీధి ప్రాంతాల్లో అమ్మవారికి ఎక్కువ అనుబంధం ఉంది. ఏడాది పొడవునా సంప్రదాయ మణ పూజలు, ప్రతి మంగళ, శుక్రవారాల్లో అభిషేకాలు ఇక్కడ ప్రత్యేకం. సాధారణంగా గ్రామదేవత అంటే జంతుబలి ఉంటుంది. అమ్మవారు శాంతస్వరూపిణి కావడంతో ఈ ఆలయంలో బలులు నిషేధం.


అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద భక్తులు

భక్తుల విరాళాలతో అభివృద్ధి..

ప్రస్తుత ఆలయ ప్రాంగణాలను రూ.కోట్లు వెచ్చించి భక్తులు అద్భుతంగా తీర్చి దిద్దారు. ప్రాంగణంలోనే వేంకటేశ్వర, భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి, జ్ఞానసరస్వతి, లక్ష్మీగణపతి, అయ్యప్పస్వామి, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సూర్యనారాయణమూర్తిలను ఉప ఆలయాలలో కొలువుదీర్చారు. అన్నపూర్ణాదేవి మండపంలో సంక్రమణం, దసరా ఉత్సవాల సమయంలో వేలాది మందికి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు. ఈ మండపాన్ని దర్శించడమే మహాభాగ్యంగా భక్తులు భావిస్తుంటారు.


స్వేచ్ఛావతి అమ్మవారి ప్రధానరూపం

నవరాత్రుల్లో విశేష పూజలు..

దసరా ఉత్సవాల్లో తొమ్మిది రూపాల్లో అమ్మవారిని అలంకరిస్తారు. నిత్యం ఉభయవేళల్లో శాంతి హోమాలు, 9వ రోజున పూర్ణాహుతి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. వందల సంఖ్యలో అఖండ దీపాలు వెలిగించి, దీక్షల్లో భక్తులు పూజలు చేయడం ఇక్కడ విశేషం. విజయదశమి నాడు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నవరాత్రుల్లో ఆలయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

బంధుమిత్రులు వస్తారు..

మాది ఉత్తరాది. రవాణా రంగ కేంద్రంలో జీవనం సాగించేందుకు మా తండ్రితోపాటు కుటుంబ సభ్యులందరం ఇక్కడకు వచ్చి స్థిరపడ్డాం. దసరా ఉత్సవాలకు ఉత్తరాది నుంచి మా బంధువులు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తుంటారు. ఆ సమయంలో బంధుమిత్రులను కలుసుకుంటాం. ఇది అమ్మవారి మహత్యమే.
– కృష్ణ శర్మ, మున్నాసింగ్, ప్రదీప్‌నాయర్, ఇచ్ఛాపురం

ఇదేం దుస్థితి..



పలాస మండలం రెంటికోటలోని మేదర వీధిలో రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డు పైకి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా నడవడానికి కూడా ఇబ్బంది ఉందని చెబుతున్నారు. సీసీ రోడ్డు వేసి, కాలువలు నిర్మించాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి సద్గుణ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ప్రజాధనం వృథా..

కంచిలి మండల కేంద్రంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం నేటికీ వినియోగంలోకిరాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చినా ఇక్కడ మార్పు లేదు. సమీపంలోనే ఎంపీడీవో, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఉన్నా దీనిపై ఎవరూ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఏఈ హిమసాగర్‌ను వివరణ కోరగా లోపలి భాగంలో కొన్ని పనులు చేపట్టాల్సి ఉందని, పనులు పూర్తయిన వెంటనే పేరు మార్చుచేసి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. –న్యూస్‌టుడే, కంచిలి




ప్రమాదకరంగా దారి..



ఇచ్ఛాపురం పట్టణం సంతపేట వద్ద ఉన్న జేఎల్ కాలనీ నుంచి పాత జాతీయ రహదారికి వెళ్లే మార్గం ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. కాలనీ రోడ్డు చివర పొదలు పెరిగి ఇరువైపులా నుంచి వచ్చే వాహనాలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. సీసీ రహదారిని నిర్మించాలని కోరుతున్నారు. ఈ సమస్యను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మరమ్మతులు చేపట్టరూ..

మందస మండలం తాళ్లగురంటి పంచాయతీ కుల్లాడిలో తాగునీటి పథకం పైపులైను ఇటీవల మరమ్మతులకు గురికావడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా సుమారు కిలోమీటరు దూరం ఉన్న కళింగదళ్ జలాశయం వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని సర్పంచి ఎస్.బసంతి తెలిపారు
– న్యూస్‌టుడే, మందస



చీకట్లు తొలగేదెలా...?



పలాస మండలం సున్నాడలోని పెరటి వీధిలో వీధి దీపం దాదాపు పది రోజులుగా వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళ బయటకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శరత్ దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

నేటితో ముగియనున్న ఈకేవైసీ గడువు

సోంపేట, న్యూస్‌టుడే : వరి పంట నమోదు ఈకేవైసీ సోమవారంతో ముగుస్తుందని ప్రతి రైతు తప్పక చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బొర్ర నరసింహమూర్తి అన్నారు. ఆదివారం ఆయన టి.శాసనం గ్రామంలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 9,039 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని, ఇప్పటి వరకు 8,600 ఎకరాలకు సంబంధించిన రైతులు మాత్రమే ఈకేవైసీ చేయించున్నారన్నారు. ఇంకా 433 ఎకరాలకు సంబంధించి 500 మంది రైతులు సోమవారం 5 గంటల లోపు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

సోంపేట, న్యూస్‌టడే : తీర ప్రాంత మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షుడిగా బడే తమ్మారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బారువ సముద్ర తీరంలో నియోజకవర్గంలోని 24 గ్రామాల మత్స్యకార ప్రతినిధులు సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. ఉపాధ్యక్షుడిగా బడే గురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బైపల్లి దాలయ్య, కార్యదర్శిగా సూరిన రమేష్‌లను ఎన్నుకున్నారు. మాజీ మత్స్యకార ఐక్యవేదిక అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు శుభాకాంక్షలు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో కారగ్గి వసంతరావును మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, రెంటికోట పంచాయతీ కార్యదర్శి సద్గుణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్కనిచ్చి స్వాగతం పలికారు.

దుర్గాదేవి.. నమోస్తుతే


పలాస: కన్యకాపరమేశ్వరి ఆలయంలో వైశ్యసంక్షేమ సంఘం ప్రతినిధులు


కవిటి: గొండ్యాలపుట్టుగలో సామూహిక కుంకుమ పూజలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో మహిళలు పెద్దఎత్తున పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని లలితాత్రిపుర సుందరీ రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.
– న్యూస్‌టుడే బృందం


కంచిలి: నిజరూప దర్శనంలో కంచమ్మతల్లి

పాదలు తొలగించారు..

స్పందనకు వందనం



మందస మండలం ఉగ్రవాని పేట-సరియాపల్లి మధ్య రహదారి బెర్మ్‌ల్లోని పొదలు తొలగించారు. ఈ రహదారిలో పొదలు దట్టంగా అల్లుకుని ప్రజలు అసౌకర్యానికి గురవుతుండటంపై ఆదివారం 'ఈనాడు'లో వచ్చిన వార్తపై సర్పంచి బి.వెంకటరావు స్పందించారు. రహదారి బెర్మ్‌ల్లోని పొదలను కూలీలతో తొలగింపజేశారు. పంచాయతీ పరిధిలోని మిగతా రహదారుల బెర్మ్‌ల్లో అల్లుకున్న పొదలను తొలగించి శుభ్రం చేస్తామని తెలిపారు.
– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

కిడ్నీ వ్యాధి బాధితుడికి సాయం



కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగకు చెందిన లింగరాజ దొళాయికి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి, రూ.7వేలు, నిత్యావసరాలను అందించారు. సంస్థ సభ్యులు సావాడ గణేష్, నీలాపు దుర్యోధన, దక్కత శంకర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

అవీ.. ఇవీ.. అన్నీ

కొండపోలమ్మకు మొక్కుల చెల్లింపు



ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండపోలమ్మకాలనీలో కొండపోలమ్మకు స్థానికులు మొక్కులు చెల్లించుకున్నారు. దసరా ముందుగా వచ్చే ఆదివారం మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. తొలుత కాలనీ మధ్య మండపం వద్ద అమ్మవారి ఘటాలను కొలువుతీర్చి పూజలు చేశారు. వీధి వాసులందరూ అమ్మవారి ఘటాలను తలపై ఉంచి ఆలయం వరకూ మేళతాళాలు, కాళీమాత నృత్యాలతో సాగారు. అక్కడ అమ్మవారి ఘటాలను పీఠంపై కొలువుతీర్చారు. అక్కడే వంటా వార్పు చేసుకుని సహపంక్తి భోజనాల అనంతరం కాలనీకి తిరిగి చేరుకున్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల విజేత గరుడభద్ర



వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడులో దుర్గాదేవి పూజా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విజేతగా గాయత్రి స్కూల్ గరుడభద్ర నిలిచింది. ద్వితీయ స్థానంలో సాయి శిరీష స్కూల్ చినబాడం, తృతీయ స్థానంలో హరిపురం ఉన్నత పాఠశాల నిలిచింది. విజేతలకు పూజా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు.
– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

యువజన సభ్యుల శ్రమదానం

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం పల్లిసారథి నుంచి గొల్లసారథి మధ్య రహదారి పొడవున పొదలు పెరిగి చెట్ల కొమ్మలు రోడ్డు పైకి రావడం సంబంధిత శాఖ స్పందించక పోవడంతో స్థానిక జనచైతన్య ఆర్ట్స్ యువజన సంఘ సభ్యులు స్పందించారు. ఈమేరకు ఆదివారం రోడ్డుకు ఇరువైపుల పొదలు, చెట్ల కొమ్మలు తొలగించి ప్రయాణం మెరుగు పరిచారు. దీంతో ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఉప్పరపల్లి వాసుదేవ్, ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, హేమంతరావు, ధర్మరావు, గణపతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

జానపద కళాకారుడికి నివాళులు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం మాకన్నపల్లికి చెందిన ఉత్తరాంధ్ర జానపద కళాకారుడు సాలిన అశోక్ మొదటి వర్ధంతి సభను సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం మాకన్నపల్లిలో నిర్వహించారు. అశోక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, మామిడి కృష్ణారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

285వ రోజుకు బెంతొరియాల దీక్ష

కవిటి, న్యూస్‌టుడే : బెంతొరియాల తమ కుల ధ్రువీకరణ పత్రాల కోసం కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 285వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం దీక్షలో లండపుట్టుగ గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు లేక తమ పిల్లల భవిష్యత్ అంధకారంగా మారిందని, తక్షణమే కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని కోరారు.

యూరియా బస్తాల పట్టివేత

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎం.ఎస్ పల్లి, కొల్లూరు గ్రామాల సరిహద్దు చెరువు వద్ద ఒడిశా నుంచి అక్రమంగా వాహనంలో తరలిస్తున్నా 70 యూరియా బస్తాలను వ్యవసాయాధికారులు, తెదేపా నాయకులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో వాహనాన్ని తనిఖీ చేయగా ఓ వైకాపా నాయకుడి వద్దకు యూరియా బస్తాలు చేరుతున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. మండలంలో ఎరువుల కొరత తీవ్రంగా వేదిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో ఒడిశా నుంచి ఎరువులు అక్రమంగా దిగుమతి చేసుకుని రెట్టింపు ధరలకు ఆ నేత అమ్ముతున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బస్తాలను అధికారిక డీలర్ భగవాన్ గుప్తా దుకాణానికి వ్యవసాయాధికారులు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బాహుదానది నుంచి అక్రమంగా ఇసుకను తవ్వి, ట్రాక్టర్లపై తరలిస్తున్న ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై ఇ.శ్రీనివాస్ తెలిపారు. బాహుదానది ఈదుపురం, లొద్దపుట్టి ప్రాంతాల్లో ఇసుకను తవ్వి తరలిస్తుండగా ఆదివారం రాత్రి వాటిని స్వాధీన పరచుకున్నామని ఎస్సై తెలిపారు.

చెత్త పేరుకుపోయి ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు


రాజుగారిపేట వద్ద వ్యర్థాలను తింటున్న శునకాలు

సోంపేట, న్యూస్‌టుడే: సకాలంలో చెత్తను తొలగించకపోవడంతో సోంపేట పట్టణంలో పరిస్థితి నానాటికీ ఇబ్బందికరంగా మారుతోంది. ముఖ్య కూడళ్లలో పెద్ద ఎత్తున చెత్త చెదారాలు పేరుకుపోతుండటంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది తక్కువగా ఉండటంతో పాటు కోటబొమ్మాళి ఉత్సవాలకు ఇక్కడ నుంచి సిబ్బందిని పంపించడంతో సమస్య తలెత్తింది. పంచాయతీ పరిధిలో 170 వరకు వీధులుండగా కేవలం 33 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. అందులో 13 మంది మహిళలున్నారు. వీరు ఒక్కో వీధి శుభ్రం చేయడానికి వారం రోజులకు పైనే సమయం పడుతుంది. మూడు ట్రాక్టర్లుండగా అందులో ఒకటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. కొత్తగా వచ్చిన ఈవో మరొక ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకున్నప్పటికీ సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. శరన్నవరాత్రులు కావడంతో ఆలయాలకు వెళ్లే భక్తులతో వీధులు, రోడ్లు నిత్యం రద్దీగా మారుతున్నాయి. కనీసం పదిరోజులకు ఒకసారైనా కొన్ని వీధులకు పారిశుద్ధ్య సిబ్బంది వెళ్లకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

అధ్వానంగా కాలువలు..

ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాల్వల పరిస్థితి అధ్వానంగా మారింది. దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. పట్టణంలో జ్వరాలు కూడా అధికంగా ఉండటంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా గాంధీ నగర్, రాజుగారిపేట, బీసీ కాలనీ, యశోదా నగర్, కొత్తపేట, రేకులకాలనీ, డాబా కాలనీ, మొగలికొత్తూరు, కొత్తూరువారి వీధులతోపాటు శివారు ప్రాంతాల పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతాం..

కోటబొమ్మాళి ఉత్సవాలకు సిబ్బందిని పంపించడంతో కొంతమేర ఇబ్బందులు ఏర్పడ్డాయి. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ ఇతర చర్యలు చేపడుతున్నాం. సోమవారం నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతాం. – ఎం.శాంతికుమారి, పంచాయతీ ఈవో

'సోంపేట ఉద్యమం' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో పాల్గొన్న పర్యావరణ పరిరక్షణ సంఘం, మత్స్యకార ఐక్య వేదిక నాయకులు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన వారి చరిత్రను వివరిస్తూ హైదరాబాద్ సుందరయ్య ఫంక్షన్‌హాల్ భవన్‌లో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సోంపేట ఉద్యమ పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక రచయిత్రి, మానవహక్కుల ప్రతినిధి కె.అనురాధ మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొని ప్రాణాలర్పించిన వ్యక్తులు, గాయపడిన వారి గొప్పతనం గురించి పుస్తకంలో వివరించారన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక వ్యవస్థాపకులు బాలగోపాల్, మత్స్యకార ఐక్య సంఘం నాయకులు, పర్యావరణ పరిరక్షణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉద్దానం కిడ్నీ విషాదాలు..

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: రచయిత, పరిశోధకులు బద్రి కూర్మారావు సంపాదకత్వంలో ఉద్దానం కిడ్నీ విషాదాలు అనే పుస్తకాన్ని పలాస మండల పరిషత్తు కార్యాలయంలో ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, యూపీపీఎస్సీ మాజీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం ఆదివారం ఆవిష్కరించారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం, కళింగ సీమ సాహిత్య సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఉద్దానం కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. డా.మల్లేశ్వరరావు, డా.తెప్పల ఆనంద్, డా.గిరిబాబు, మట్ట ఖగేశ్వరరావు, బమ్మిడి సుబ్బారావు, కళాకారులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852
మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

? నందిగాం మండలం సైలాడ పంచాయతీ దేవాడ గ్రామంలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోంది. అధికారులు స్పందించాలి. - **గున్న మన్మథరావు, స్థానికుడు**

● గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తెలియజేస్తాం. పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. - **సీహెచ్.రవి, పంచాయతీ కార్యదర్శి, సైలాడ** – న్యూస్‌టుడే, నందిగాం

టెక్కలి

● టెక్కలి ● నరసన్నపేట ● పాతపట్నం



అఖండ నామ సంకీర్తన

సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని నరసన్నపేటలోని మారుతీనగర్ సత్యసాయి మందిరంలో జరుగుతున్న అఖండ నామ సంకీర్తనకు విశేష స్పందన లభిస్తోంది. ఈనెల 4న ప్రారంభమైన ఈ కార్యక్రమం 8వ తేదీ వరకు కొనసాగుతుందని మందిర ప్రతినిధులు తెలిపారు. మహిళా సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రసాద వితరణ జరిగింది. 45 బృందాలు ఈ నామ సంకీర్తనలో పాల్గొన్నాయి. – న్యూస్‌టుడే, నరసన్నపేట

తిరుమలలో పేట మహిళా బృందం ప్రదర్శన

నరసన్నపేట, జలుమూరు, న్యూస్‌టుడే: తిరుమలలో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో నరసన్నపేటకు చెందిన నమో వెంకటేశ కోలాట బృందం సభ్యులు ప్రదర్శనలిచ్చారు. ఆదివారం జరిగిన సింహవాహన, ముత్యాల పల్లకి సేవల్లో సభ్యుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోలాట బృందం అధ్యక్షురాలు మెండ కృష్ణవేణి, బోయిన సీతామహాలక్ష్మి, కృష్ణవేణి, పుష్పలత పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న నమో వెంకటేశ కోలాట బృందం సభ్యులు

న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

డివిజన్ కేంద్రం టెక్కలిలోని పలు ప్రధాన మార్గాల్లో శిథిల కల్వర్టులు ప్రజలను కలవరపెడుతున్నాయి. రంధ్రాలు పడటం, సిమెంటు పలకలు తొలగించి వదిలేయడంతో ప్రమాద హేతువులుగా మారుతున్నాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణ లేకపోవడం, నిధుల లేమితో పంచాయతీ అధికారులు మరమ్మతులు జరిపించక పోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇటీవల టెక్కలి పట్టణంలో పర్యటించిన రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు కల్వర్టుల నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో పరిష్కారం దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు.



రాందాసుపేటవీధి కూడలిలో తవ్వి వదిలేసిన కల్వర్టు

కలవరపెడుతున్న కల్వర్టులు

తరచూ ప్రమాదాలు

● టెక్కలి పట్టణంలోని చిన్నబజారులో చేపల మార్కెట్ దుకాణ సముదాయం సమీపంలో కల్వర్టు శిథిలమైంది. ఐదేళ్లగా ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ● పాత జాతీయ రహదారి నుంచి రాందాసుపేట వీధికి వెళ్లే కూడలిలో కల్వర్టు కింద వ్యర్థాలు పేరుకుపోయి ఆ ప్రాంతంలో వరదనీరు ముంచెత్తుతుండటంతో వైకాపా హయాంలో కల్వర్టు మధ్యలో భారీ రంధ్రాన్ని చేసి, ఆ తర్వాత పైన సిమెంటు పలకలు వేసి విడిచిపెట్టేశారు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ● ఎన్టీఆర్ నగర్-1 లైనులో కల్వర్టుపై సిమెంటు పలకలు శిథిలమై జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో అధికారుల దృష్టికి ఎన్నిసార్లు సమస్యను తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు చెబుతున్నారు. ● చిన్నకంద్రవీధి ప్రధానమార్గంలో కల్వర్టు కిందిభాగంలో ఇసుక, మట్టి మేట వేయడంతో ఆ ప్రాంతంలో చిన్నపాటి వర్షం కురిసినా ఇళ్ల ముందు మురుగు చేరుతోంది. వారాల తరబడి నిలిచిపోయి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.



కంద్రవీధి ప్రధానమార్గంలో పరిస్థితి

మరమ్మతులు చేయిస్తాం

టెక్కలిలోని కంద్రవీధి, చిన్నబజారు, ఎన్టీఆర్‌నగర్, రాందాసుపేట మార్గాల్లో కల్వర్టులు శిథిలమవడంతో వాటికి తక్షణ మరమ్మతులు జరిపించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. కంద్రవీధిలో ఇప్పటికే పనులు ప్రారంభించారు. నాలుగు చోట్ల కల్వర్టులకు మరమ్మతులు జరిపిస్తాం. ఇంకా ఎక్కడైనా సమస్య లుంటే స్థానికులు మా దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు చేపడతాం. – **జగన్నాథరావు, పంచాయతీ కార్యదర్శి, టెక్కలి**

సేవలతో గుర్తింపు



ఈవోపీఆర్డీ పద్మజను సన్మానిస్తున్న మండల పరిషత్తు సిబ్బంది

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అందించిన సేవలే ఉద్యోగులకు గుర్తింపునిస్తాయని జడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథరావు పేర్కొన్నారు. ఈవోపీఆర్డీగా సేవలందించిన పద్మజ బదిలీ అవడంతో ఆమెను ఆదివారం మండల పరిషత్తు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. ఈ మేరకు పంచాయతీల అభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారి జవాన్ మృతి

నందిగాం, న్యూస్‌టుడే: రైలు నుంచి జారి పడి నందిగాంకు చెందిన ఆర్మీ జవాన్ జి.జగదీశ్వరరావు(37) మృతి చెందాడు. దసరా సెలవులకు కలకత్తా నుంచి శ్రీకాకుళం వస్తుండగా రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రగాయాలై మృతి చెందారు. రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు ఆదివారం సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆనాటి ఆ స్నేహం ఆనంద గీతం

కొత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వృత్తి, ఉపాధి రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలుసుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.



కొత్తూరు ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నేడు వినతుల స్వీకరణ

సారవకోట, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు సమావేశ భవనంలో సోమవారం జరగనున్న మీకోసం కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరవుతారని తహసీల్దారు విజయలక్ష్మీ ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని ఆమె చెప్పారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జలుమూరు, న్యూస్‌టుడే: జలుమూరు మండలం రావిపాడులో సర్పంచి బోర భారతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రహదారులపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేశారు. తెదేపా నాయకులు గుండ రామకృష్ణ, గొల్లంగి సత్యనారాయణ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు

కదలదు.. వదలదు



టెక్కలి పట్టణంలోని కచేరివీధిలో సంతోషిమాత ఆలయం వద్ద కల్వర్టు కింద పూడుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యర్థాలు ఇక్కడ ఉండిపోయాయి. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, వీటిని తొలగించి మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు తెలిపారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

నీరుగారిన లక్ష్యం..!



జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు తామరాపల్లిలో రూ.1.16 కోట్లతో పనులు ప్రారంభించారు. కొంత మేరకు పనులు అనంతరం నిలిచిపోవడంతో లక్ష్యం నీరు గారిపోయింది. దీంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయభాస్కర్ మాట్లాడుతూ.. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

వర్షం పడితే ఇదే తంతు

సారవకోట మండలం అన్నుపురంలో బీటీ రహదారిపై వర్షం నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు పాట్లు తప్పడం లేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సైతం దెబ్బతింటోందని వాపోతున్నారు. వాన పడిన ప్రతిసారి ఇదే సమస్య ఎదురవుతుందని, పాలకులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచి భీమారావు వద్ద ప్రస్తావించగా సమస్యను పరిష్కరించాలని కార్యదర్శికి సూచించామని చెప్పారు. ర.భ.శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట



ఇంటి ముందు దిష్టిబొమ్మల్లా..!



కొత్తూరు మండలం బాంద్రగూడ గ్రామంలో తాగునీరు అందించేందుకు ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేశారు. సుమారు ఆరు నెలలు అవుతున్నా నీటి సరఫరా లేకపోవడంతో ఇంటి ముందు దిష్టిబొమ్మల్లా మిగిలాయని స్థానికులు వాపోతున్నారు. తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మణికంఠ వద్ద ప్రస్తావించగా.. సమస్యను పరిష్కరించి ప్రజల కష్టాలు తీరుస్తామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ముందే మేల్కొంటే మంచిది

జలుమూరు మండలంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ ప్రవహిస్తుంది. దీనిపై 40 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు పలుచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇనుప ఊచలు బయటకు కనిపిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. 10 ఆర్ కాలువపై కరకవలస వద్ద వంతెనను చిత్రంలో చూడవచ్చు. సమస్యపై వంశధార జలుమూరు శాఖ డీఈ బి.సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు



శత్రు వినాశిని.. శక్తి స్వరూపిణి

టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా దేవీ నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అమ్మవారిని కొలువుదీర్చిన మండపాల్లో భక్తులు ఆదివారం సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక హోమాలు చేపట్టి, మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

న్యూస్‌టుడే బృందం



సారవకోట మండలం కిడిమిలో..



టెక్కలిలోని ఆర్టీసీ డిపో ఎదురుగా పూజలందుకుంటున్న అమ్మవారు



ఎల్ఎన్‌పేట మండలం శ్యామలాపురంలో..



ఉర్లాం మార్కెట్ కూడలిలో లలితాదేవి రూపంలో..



నరసన్నపేటలో సామూహిక కుంకుమ పూజలు



పాతపట్నం: నీలమణిదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



కోటబొమ్మాళి: పెద్దబమ్మిడి పంచాయతీ నిమ్మాడ కూడలిలో..

ఎన్నాళ్లీ పాట్లు..?

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోటలోని ఐసీడీఎస్ కార్యాలయ భవనం 1991లో నిర్మించారు. భవనం చుట్టూ చెట్లు ఉండటంతో పైకప్పుపై ఆకులు పేరుకుపోయాయి. వర్షం నీరు నిల్వ ఉండటంతో శ్లాబ్ పాడైంది. పెచ్చులు ఊడి కింద పడుతున్నాయి. వర్షం నీరు గదుల్లోకి చిమ్ముతుండటంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. భవనం అధ్వానంగా మారడంతో కార్యాలయం పరిధిలోని సారవకోట, జలుమూరు మండలాలకు చెందిన సిబ్బంది సమావేశాలు నిర్వహించడానికి అవకాశం లేకుండా పోయింది. నాటి నుంచి చెట్ల నీడలోనే సమావేశాలు జరుగుతున్నాయి. వర్షాలు పడితే వీరి పాట్లు వర్ణనాతీతం. పాలకులు స్పందించి కొత్తభవనాన్ని నిర్మిస్తే మేలు జరుగుతుందని కార్యకర్తలు భావిస్తున్నారు. ఈ విషయాన్ని పీవో కామాక్షీ వద్ద ప్రస్తావించగా, భవనం పాతది కావడంతో ఇబ్బందులు తప్పడంలేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు, పీడీకు త్వరలోనే నివేదిస్తామన్నారు.



కార్యాలయంలో ఓ గది పైకప్పు దుస్థితి



చెట్టు నీడలో నిర్వహిస్తున్న సెక్టారు సమావేశం

సంక్షిప్త సమాచారం

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రపంచ ఈత పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన టెంక ప్రేమ్‌కుమార్‌కు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఆర్థికసాయం చేశారు. జమ్ము గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ ఈనెల 13న ఈజిప్టులో జరిగే అంతర్జాతీయ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆదివారం నరసన్నపేట, పలాస నియోజకవర్గాల ప్రతినిధులు కె.చిన్నవాడు, సంపత్‌కుమార్, అప్పన్న, ప్రవీణ్‌కుమార్ రూ.8 వేలు అందించారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం తహసీల్దారు కార్యాలయం రహదారిలోని శ్మశాన వాటిక స్థలం ఆక్రమణలకు గురవుతుందని స్వర్గధామం భవనం నిర్మాణ దాత సింహాద్రి కాళీప్రసాదరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ భూమి సాగుచేస్తున్న కొంతమంది శ్మశానం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు కార్యాలయం, పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై తహసీల్దారు హనుమంతరావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. ఈనెల 8న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పెద్ద సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండలంలోని బుడితి, అవలంగి గ్రామాల్లోని హోటళ్లు, కిరాణా దుకాణాల్లో ఎస్ఐ అనీల్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

IN THE COURT OF HONOURABLE SENIOR CIVIL JUDGE AT GODAVARIKHANI
H.M.O.P. No 3 of 2024
Between:
Mothe Ravikanth ...Petitioner
And
Yelamili Anuradha @ Mothe Anuradha ...Respondent
To,
Yelamili Anuradha @ Mothe Anuradha, W/o. Mothe Ravikanth, D/o. Rajarao, age: 30 yrs, R/o. 3-74, Syrigam Village, Jalmuru Mandal of Srikakulam District A.P.
Where as the above mentioned petitioner filed H.M.O.P. against respondent and it is registered as H.M.O.P. 3 of 2024, notices sent to your address where returned unserved and afore said case was posted on 25-10-2024 for your appearance and for filling counter if any.
Take notice and to appear before the above said court in person or through an Advocate on the said date at 10:30 a.m. failing which the matter will be heard and determined in your absence as exparte.
//By the order of the Court//
Through
Sd/-, S.AVINASH KUMAR
Advocate, Gandhinagar, Godavarikhani. Mob: 9948400429

చేయి చేయి కలిపి.. చేయూత అందించి..!

న్యూస్‌టుడే, హిరమండలం, పాతపట్నం

హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి పూర్వ విద్యార్థులు 40 మంది కలిపి 2016లో సంఘంగా ఏర్పడ్డారు. చైల్డ్ హుడ్ చాపర్స్ పేరుతో 2018 వరకు స్థానికంగా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించడం, ఆపదలో ఉన్న వారికి వీలైనంత సాయం చేసేవారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు శ్రీధర్, పలు గ్రామాలకు చెందిన 170 మంది సభ్యులు చైల్డ్ హుడ్ చాపర్స్ పేరు మారుస్తూ 2018లో హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం పేరుతో సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. తొమ్మిదేళ్ల కాలంలో సభ్యుల సంఖ్య 300కు చేరింది.



రక్తదానం చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంఘ సభ్యులు

అందజేస్తున్న సేవల్లో కొన్ని

వ్యవస్థాపక అధ్యక్షుడితో కలిసి అధ్యక్షుడు వానపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు శాసనపురి ప్రతిభ, ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులతో కలిసి జిల్లాలో పలు సేవలు అందజేస్తున్నారు.

● 2019లో రూ.6 లక్షలతో అంతిమయాత్ర రథం ఏర్పాటు చేశారు. హిరమండలం, పాతపట్నం, ఎల్ఎన్‌పేట మండలాల్లో ఎవరైనా మృతి చెందితే పార్థివదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఈ వాహనం ఉచితంగా ఇస్తున్నారు.

● రూ.6.70 లక్షలతో ఏర్పాటు చేసిన అంబులెన్స్ ద్వారా భామిని, కొత్తూరు, హిరమండలం, పాతపట్నం, ఎల్ఎన్‌పేట మండలాల్లో 113 మందికి సేవలు అందజేశారు.

● రూ.3 లక్షలతో మూడు శీతల పెట్టెలు (ఫ్రీజర్ బాక్సులు) అందుబాటులో ఉంచారు.

● అనాథ శవాలకు అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు.

● మూడు ఆక్సిజన్ సిలిండర్లు, ఆక్సిజన్ కాన్సెంట్రేటర్ 1, ఆక్సిజన్ వెంటిలేటర్ 1 ప్రజలకు అందుబాటులో ఉంచారు. కొవిడ్ సమయంలో వీటిని ప్రజలు ఎక్కువగా ఉపయోగించుకున్నారు.

● ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన, నేత్ర, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

● జిల్లాలో సుమారు 600 మందికి పైగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలు ఉన్నారు. వారిలో 40 మందికి ఈ సభ్యులు ప్రతి నెలా రక్తదానం చేసేందుకు దత్తత తీసుకున్నారు.

సభ్యులు, దాతల సహకారంతోనే..

దాతలు, గ్రామస్థుల ఆర్థిక సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈఎంఐ విధానంలో అంబులెన్స్, అంతిమ రథం కొనుగోలు చేశాం. వాటి అప్పును ప్రతి నెలా వాయిదాల పద్ధతిలో తీరుస్తున్నాం. – **పి.శ్రీధర్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు**

పంచపది కవిరత్నగా చంద్రమౌళి



ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండల విద్యాశాఖ అధికారి కుప్పిలి చంద్రమౌళికి పంచపది కవిరత్న బిరుదును హైదరాబాదుకు చెందిన పంచపది కవన వేదిక సభ్యులు ప్రదానం చేశారు. 125 పంచపదులు రాసినందుకు గానూ సంస్థ ప్రతినిధులు తనకు బిరుదు ప్రదానం చేసినట్లు చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవోను ఎల్ఎన్‌పేట మండల ఉపాధ్యాయులు, ఎంఈవో-1 మణికుమార్ అభినందించారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించ వచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): దక్షిణ ★ సూర్యమహల్: స్వాగ్ ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: మత్తువదలరా-2 ★ మారుతి: చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

అంతర్జాతీయ వాకర్‌కు అభినందన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ రేస్ వాకర్ సంజీవ్ నళిని సుధాకర్‌ను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ రేస్ వాకింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో 3కి.మీ, 5కి.మీ., 10కి.మీ వాకింగ్ పోటీల్లో సుధాకర్ మూడు పసిడి పతకాలు సాధించాడు.


సుధాకర్‌ను అభినందిస్తున్న రామ్మోహన్ నాయుడు

వాకర్స్ సేవలు విస్తరించాలి


సమావేశంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: వాకర్స్ సేవలు జిల్లాలో మరింత విస్తరించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 జిల్లా గవర్నర్ నారాయణస్వామి అన్నారు. వాకర్స్ క్లబ్‌లు విస్తరించి ప్రజలు మరింత ఆరోగ్యవంతంగా ఉండేందుకు సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని మహాత్మాగాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో ఆదివారం నిర్వహించిన మూడో క్లబ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 27న పార్వతీపురంలో జరగనున్న వాకర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యోగాలో లింగన్నాయుడుపేట వాసి సత్తా


రోహిణిని అభినందిస్తున్న తూ.గో. ఎస్పీ నరసింహకిశోర్, అదనపు ఎస్పీ అల్లూరి వెంకటసుబ్బరాజు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఆలిండియా యోగా పోటీల్లో జలుమూరు మండలం లింగన్నాయుడుపేట గ్రామానికి చెందిన రావాడ రోహిణి అద్వితీయమైన ప్రదర్శనతో రాణించింది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయ్ వేదికగా జరిగిన ఆలిండియా పోలీస్ క్లస్టర్ పోటీల్లో రజత పతకం సాధించింది. ఆమె తూర్పుగోదావరి జిల్లా పోలీస్‌శాఖలోని సైబర్ ల్యాబ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. గతంలో విశాఖపట్నం, జలంధర్, నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఆలిండియా పోలీస్ యోగా పోటీల్లోనూ ఉత్తమ ప్రదర్శన చేసింది. రోహిణిని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు, స్పోర్ట్స్ ఐజీ, తూ.గో. ఎస్పీ డి.నరసింహకిశోర్, అదనపు ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు తదితరులు అభినందించారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమాలు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి వంద రోజుల ప్రణాళిక తయారు చేయడంలో భాగంగా సోమ, మంగళవారాల్లో గ్రామ ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. మండల పరిషత్తు, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమానికి ప్రతి పంచాయతీ నుంచి ఒక ఉప సర్పంచి, ఇద్దరు వార్డు సభ్యులు(పురుషుడు, మహిళ) హాజరుకావాలని కోరారు.

ఆక్రమించేయ్... అడిగేదెవరు..!

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు చోట్ల ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ప్రధాన రహదారులకు అనుసరించి ఉన్న స్థలాల్లో దుకాణాలు నిర్మించుకుంటున్నారు. మరికొందరు ఇనుప గజాలతో పిల్లర్లు, రాళ్లతో పునాదులు వేసి ఏకంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పెద్ద వాహనాలు ఒకేసారి జంక్షన్లకు చేరుకుంటే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇది అంతర్రాష్ట్ర రహదారి కావడంతో ఊక లారీలు వస్తే రొట్టవలస, సవలాపురం కూడలి, సరుబుజ్జిలి, కొత్తకోట కూడళ్ల వద్ద ఇబ్బందులు పడుతున్నారు.

స్థలాలకు గిరాకీ

ప్రధాన కూడళ్ల వద్ద స్థలాలకు గిరాకీ పెరగడంతో కొందరు విలువైన స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో సెంటు భూమి విలువ రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు పలుకుతోంది. దీంతో సామాన్యుడు ఇంటి స్థలం కొనుక్కోలేని పరిస్థితి ఏర్పడింది.

నియోజకవర్గంలో పరిస్థితి

★ సరుబుజ్జిలి: మండల కేంద్రంలోని శిమ్మకోనేరు గట్టు నుంచి అలికాం-బత్తిలి రహదారిలో వంశధార కుడి ప్రధాన కాలువ గట్టు వరకు రోడ్డుకు సమీపంలో దుకాణాలు, ఇళ్లు నిర్మించుకొని వ్యాపారాలు సాగించుకుంటున్నారు. ★ రొట్టవలస కూడలి వద్ద ముందు వ్యాపారాల కోసం దుకాణాలు ఏర్పాటు చేసుకొని తరువాత ఇష్టారాజ్యంగా ఇళ్లు నిర్మించుకోవడంతో రహదారి ఇరుకుగా మారిపోయింది. సవలాపురం కూడలిలో కొందరు ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఇళ్లు, దుకాణాలు నిర్మించుకోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

★ ఆమదాలవలస: మండలంలోని జొన్నవలస, పార్వతీశంపేట, బొడ్డేపల్లిపేట కూడళ్ల వద్ద కొందరు ఆర్‌అండ్‌బీ స్థలాల్లో దుకాణాలు, ఇళ్లు నిర్మించుకోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.


రొట్టవలస కూడలిలో ఆర్‌అండ్‌బీ స్థలంలో ఏర్పాటు చేసిన దుకాణాలు

★ బూర్జ: మండలంలోని వైకుంఠపురం, ఉప్పినివలస, కొల్లివలస, రాజుపేట, మదనాపురం, రామన్నపేట, అప్పలపేట, కె.కె.రాజపురం కూడళ్ల వద్ద ఆక్రమణలు పాల్పడి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టారు.

★ పొందూరు: మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఇక్కడ ప్రధాన బజారు, ఆఫీసర్స్ కాలనీ, ఎంపీడీవో కార్యాలయం రహదారి ఆక్రమణలు గురికావడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలో రాపాక, లోలుగు, బాణం కూడళ్ల వద్ద కూడా స్థలాలను ఆక్రమించుకొని దుకాణాలు, ఇళ్లు నిర్మించుకున్నారు.

తొలగింపునకు చర్యలు

ఆర్‌అండ్‌బీ స్థలాల్లో ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఆక్రమణలు జరిగిన చోట్ల రెవెన్యూ అధికారుల ద్వారా ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడమైంది. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగిస్తాం.

-ఆంజనేయ నాయక్, పి.టి.రాజు, శ్రీనివాసరావు, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, పొందూరు సెక్షన్ల ఆర్‌అండ్‌బీ శాఖ జేఈలు

ఏపీఎస్ఈఏఎస్ కార్యవర్గ ఎన్నిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా రంగాచారి, ప్రధానకార్యదర్శిగా సూర్యప్రకాష్, అసోసియేట్ అధ్యక్షుడిగా జగదీష్, కోశాధికారిగా రమేష్, ఐదుగురు ఉపాధ్యక్షులు నిరోషా, శ్యామలరావు, శేఖరరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా శరత్‌కుమార్, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు.

సుదర్శన క్రియతో ఆరోగ్య ప్రయోజనాలు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సుదర్శనక్రియ సాధన ద్వారా మానసిక, ఆరోగ్య ప్రయోజనాలు అనేకమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్టేట్ టీచర్ సమన్వయకర్త అనూప్ పేర్కొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలో వైరాగ్యాన్ని వెలికి తీయడమే కాకుండా ఒత్తిడిలేని జీవితాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనూప్

ఆదిత్యుని ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


ఆలయ ఈవో భద్రాజీకి నగదు అందజేస్తున్న గోవిందరాజులు తదితరులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి శ్రీకాకుళం నగరం బొందిలీపురానికి చెందిన చింతాడ గోవిందరాజులు, గిరిధర్ శివ రూ.లక్ష విరాళం ఆదివారం అందజేశారు. స్వామి ని దర్శించుకున్న అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ఈవో భద్రాజీకి విరాళం చెక్కును అందజేశారు. ★ దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ధర్మపథం కార్యక్రమంలో భాగంగా స్వామి ఆలయ అనివెట్టి మండపంలో ఆదివారం సాయంత్రం సంగీత కచేరీ నిర్వహించారు. నరసన్నపేటకు చెందిన సప్తగిరి సంగీత విభావరి కళాకారులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం అందరిని అలరించింది.

రాకపోకలకు ఇక్కట్లు..!

పొందూరు మండలం తాడివలస గ్రామం నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో బొడ్డేపల్లి గ్రామం వద్ద దానికి ఇరువైపులా ఏపుగా పనికిరాని మొక్కలు పెరిగి ముందుకు చొచ్చుకొచ్చాయి. దీంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ ఆంజనేయ నాయక్‌తో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, పొందూరు



రహదారిలో గొయ్యి..!



ఆమదాలవలస మండలం కొత్త రోడ్డు వద్ద ఆమదాలవలస-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో పెద్ద గొయ్యి ఏర్పడటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఇది కనిపించక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి దీన్ని పూడ్చాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ ఆంజనేయ నాయక్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారి పనులు చేపడుతున్నామని, బీటీ రోడ్డు నిర్మిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

రంగు మారలేదు..!



పొందూరు మండలం కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక తాగునీటి పథకం వైకాపా రంగులతో దర్శనమిస్తుంది. దీనికి తోడు ఈ పథకం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో మన్మథరావు స్పందిస్తూ గ్రామ కార్యదర్శి నుంచి వివరాలు తెలుసుకొని క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే పొందూరు, పొందూరు గ్రామీణం

మూలకు చేరిన జనరేటర్

జి.సిగడాం తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న జనరేటర్ మూలకు చేరింది. ఇంతవరకు బాగుచేయించే నాథుడే కరవయ్యారు. కార్యాలయంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ఉద్యోగులు, వివిధ పనుల కోసం వచ్చేవారు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు బాగుచేసేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీకాంత్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు.

–న్యూస్‌టుడే, జి.సిగడాం



అవీ..ఇవీ..అన్నీ



కేంద్ర మంత్రిని కలిసిన ఆర్డీవోలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన సాయిప్రత్యూష, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిలు ఆదివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితులపై కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరుకు చెందిన అల్లంశెట్టి శ్రీవికాస్‌ను దుర్భాషలాడి, ఆయనపై దాడికి పాల్పడిన స్థానిక కూన రమణమ్మ, వడగ వెంకటశివప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

కలిసికట్టుగా ఉండండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: గ్రామస్థులు అందరూ.. కలిసికట్టుగా ఉండాలని సీఐ పైడపునాయుడు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం సానివాడ గ్రామంలో రెండురోజుల క్రితం వాట్సాప్ స్టేటస్‌ల వివాదం, ఫ్లెక్సీల వివాదం సంఘటనల నేపథ్యంలో ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో చట్టాలపై అవగాహన కలిగించారు. ఎస్ఐ కిశోర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి సేవలో తమ్మినేని

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని మాజీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజల అనంతరం అనివెట్టి మండపంలో వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ వేద ఆశీర్వచనాలు, స్వామి చిత్రపటం అందజేశారు.



కుప్పిలికి పంచపది కవిరత్న పురస్కారం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం లొద్దలపేట గ్రామానికి చెందిన కవి, రచయిత, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత అయిన కుప్పిలి చంద్రమౌళి పంచపది కవిరత్న పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన పంచపది కవన వేదిక ఆన్‌లైన్‌లో సాహిత్య రచనలను పంపించాలని కోరారు. రోజువారీ రచనల్లో ఉత్తమ రచనలను గుర్తించి పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందిస్తున్నారు. వంద రచనలు పూర్తి చేసిన కవి, రచయిత అయిన కుప్పిలి చంద్రమౌళికి ఈ పురస్కారం దక్కినట్లు, దీన్ని కొరియర్ ద్వారా పంపినట్లు ఆయన తెలిపారు.

ఎంజమ్మ తల్లికి పూజలు



బూర్జ, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు ముర్రాటలు, ఘటాలతో మొక్కులు సమర్పించారు. ఆదివారం మండలంలోని తోటవాడలో సుమారు 800 కుటుంబాలు ఎంజమ్మ తల్లికి ఘనంగా పూజలు నిర్వహించాయి. ఘటాలతో సమూహంగా ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అప్పలపేట పంచాయతీ పరిధిలో పాతపాడు కోటదుర్గమ్మను వివిధ గ్రామాల భక్తులు దర్శించుకున్నారు.

కల్లం కాదు.. రోడ్డే..!

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం, నడిమివలస, సేతుభీమవరం తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపైనే కొంత మంది రైతులు మొక్కజొన్న పంటను ఆరబెట్టడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి పక్కనే మొక్కజొన్న పంటను మిషన్ ద్వారా పనులు చేపట్టడంతో మొక్కజొన్న చెత్త వాహన చోదకులపై పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో)

★ టమాటాలు: 72 ★ వంకాయలు: 36/40 ★ బెండ: 27 ★ బీర: 46 ★ కాకర: 40 ★ దొండ: 52 ★ క్యాబేజీ బుట్ట: 30 ★ ఉల్లిపాయలు: 40/53 ★ బంగాళదుంపలు: 32 ★ పచ్చిమిర్చి: 56/60 ★ అల్లం: 76/120 ★ మునగకాడలు: 80 ★ ఆనప: 24.

–న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

ఇసుక లారీ పట్టివేత

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని పైడిభీమవరం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి అధికారులు ఇసుక లారీని పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో దాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మసిగడాం పంచాయతీ అర్జునవలస గ్రామానికి చెందిన వడగల సన్యాసి తీవ్ర గాయాలపాలయ్యాడు. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. సన్యాసి ద్విచక్ర వాహనంపై అర్జునవలస నుంచి రణస్థలం వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. ఈ ఘటనలో సన్యాసి కుడి కాలు పూర్తిగా నుజ్జవ్వడంతో చికిత్స కోసం 108 వాహనంలో శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో మహిళకు..

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ నేదురుపేట గ్రామానికి చెందిన బాస బోడమ్మ రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఎస్సై జి.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. బోడమ్మ గ్రామ సమీపంలో రోడ్డుకు పక్కన పశువులను కడుతుండగా రేగపాలెం వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె కాలు, తలకు గాయాలయ్యాయి. ప్రస్తుతం శ్రీకాకుళంలోని సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతోంది. లావేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీపీవోకు ఫిర్యాదు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఫరీదుపేట సర్పంచి కొత్తకోట పూర్ణచంద్రరావు చెక్కుపవర్‌ను తాత్కాలికంగా రద్దు చేయాలని ఇచ్చిన జిల్లా అధికారుల ఆదేశాలను మండల అధికారులు అమలు చేయకుండా గోప్యత పాటిస్తుండటంపై అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, న్యాయవాది కొత్తకోట అమ్మినాయుడు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అమ్మినాయుడు మాట్లాడుతూ తెదేపా పాలనలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గ్రామంలో రూ.3,95,197తో రెండు పనులు జరిగినట్లు, వీటికి సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసినా పనులు చేపట్టిన వ్యక్తులకు ఉద్దేశపూర్వకంగానే బిల్లులు చెల్లించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీనిపై విచారించిన హైకోర్టు దీనికి కారకులైన సర్పంచి చెక్‌పవర్ రద్దు చేయాలని ఆదేశించిందన్నారు. దీనిపై 2022 జులైలో డీపీవో సర్పంచి చెక్‌పవర్ రద్దు చేయాలని ఎంపీడీవోకు ఆదేశాలు ఇచ్చినా అవి బయటకు రాకుండా తొక్కిపెట్టి నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో పీయూసీ-1, 2 చదువుతున్న విద్యార్థినులు గత నెల 28న శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. జిల్లా స్థాయిలో ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శించడంతో నిర్వాహకులు అండర్-17 విభాగంలో సీహెచ్.దీపిక, అండర్-19 విభాగంలో ఎస్.తేజస్విని, కె.మేఘన, వై.మౌనికలను రాష్ట్రస్థాయి ఎస్.జి.ఎఫ్. పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఎఫ్‌వో మోహన్‌రావు, శివానీ ప్రాంగణం ఇన్‌ఛార్జి సాగర్, అధ్యాపకులు అభినందించారు.

తెరవే సాహితీ సమ్మేళనం

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: తెలుగు రచయితలవేదిక ఆధ్వర్యంలో 97వ నెలవారీ సాహితీ సమ్మేళనం శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ప్రముఖ రచయిత్రి బలివాడ తేజస్విని కవితా రచన, మెళకువలు అనే అంశాన్ని వివరించారు. రచయిత వాండ్రంగి కొండలరావు మాట్లాడుతూ ఉత్తమ పుస్తక రూపకల్పన విధివిధానాలను తెలియజేశారు.

హిమధాత్రి... వరప్రదాయిని..!


శ్రీకాకుళం నగరంలో కుంకుమ పూజల్లో మహిళలు


మొండేటివీధిలో..


పాండ్రంగి వీధిలో..


నానుబాలవీధిలో ..


సరుబుజ్జిలి: కొండవలసలో..



ఆమదాలవలస గ్రామీణం: నిమ్మతొర్లాడలో..

శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల మంటపాలలో, దేవాలయాల్లో దుర్గాదేవి విగ్రహాలకు కుంకుమ, ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారిని వివిధ స్తోత్రాలతో స్తుతించారు.

–న్యూస్‌టుడే బృందం


పొందూరు: అగ్రహారం వీధిలో..


పొందూరు: రాపాకలో..


ఎచ్చెర్లలో దుర్గాదేవి విగ్రహం


పొందూరు: కిలారిపేటలో..

లారీని ఢీకొన్న లగేజీ వాహనం

సరుబుజ్జిలి మండలంలోని అలికాం-బత్తిలి రహదారిలో సరుబుజ్జిలి పెట్రోల్ బంకు వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమదాలవలస వైపు నుంచి హిరమండలం వైపు పంజాబ్ లారీ వెళ్తుండగా బంకు వద్ద గుంతల్లో వేసిన మట్టిపై నుంచి లారీ మెల్లగా వెళ్తుండగా వెనుకగా వస్తున్న లగేజీ మినీ వాహనం (వ్యాన్) ఢీకొంది. ఈ ప్రమాదంలో లగేజీ వాహనం ముందు భాగం నుజ్జయ్యింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనిపై సరుబుజ్జిలి పోలీసులకు కొందరు ఫోన్ ద్వారా తెలియపరచడంతో ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



(c) eenadu